గూడూరును నెల్లూరులో కలపాలంటూ ర్యాలీ

కోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త కోటలో ఆదివారం రాత్రి జెఎసి ఆధ్వర్యంలో కాగడాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ జనార్ధనం మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలిపే విషయమై అధికారికంగా ప్రకటించే వరకు ఉద్యమం చేస్తామని అన్నారు. ఇప్పటికీ ప్రభుత్వం నెల్లూరు జిల్లాలో గూడూరును కలుపుతున్నట్లు సూచనప్రాయంగా చెప్పిందన్నారు. ఈ ర్యాలీలో ఆటో యూనియన్, వ్యాపారులు, సీపీఐ, సీపీఎం నాయకులు, జెఎసి నాయకులు జెమ్మి ప్రసాద్, మీజూరు మల్లికార్జున రావు, పాలమల్లి, పనబాక హేమంత్, భూపతి సాయి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఏర్పాట్లు విస్తృతం !

సామాన్యభక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు

పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో తొలిమూడురోజులు (రేపటినుండి జనవరి 1వరకు)మాత్రం ఆన్‌లైన్‌లో పొందిన టోకెన్లున్న భక్తులకే వైకుంఠ దర్శనాలు చేయించేలా టిటిడివిస్తృత ఏర్పాట్లుచేసింది. ప్రభాతవార్త, తిరుమల

తిరుమల,డిసెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

వైకుంఠ ఏకాదశి,ద్వాదశి జనవరి 1తోబాటు జనవరి 8వరకు తిరుమలకు వచ్చే భక్తులకు వైకుంఠ దర్శనాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని సేవలందించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. వైకుంఠద్వార దర్శనాలను భక్తులకు దివ్యానుభూతిగా మార్చాలని సూచించారు.ఈ పదిరోజులు భక్తుల భద్రత, రద్దీ నిర్వహణకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తిరుమలలో అత్యాధునిక కృత్రిమ మేధస్సు(ఏఐ)సాంకేతికత వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ సాంకేతికత ద్వారా భక్తులు, వాహనాల రద్దీపై ప్రత్యక్ష పర్యవేక్షణ జరుగుతుందని వెల్లడించారు. వైకుంఠద్వార దర్శనాల భద్రత, సేవలకు వచ్చిన పలుశాఖల అధికారులు, ఉద్యోగులతో టిటిడి జెఈఓ వీరబ్రహ్మం, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఐటి జిఎం ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఇతర అధికారులతో సమావేశమయ్యారు.ఇప్పుడు వైకుంఠద్వార దర్శనాలకు టోకెన్లు కేటాయింపులో విధానాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు అదనపు ఈఓ వెంకయ్య చౌదరి తెలిపారు.విధులు నిర్వహణకు వచ్చిన సిబ్బంది వ్యవస్థను పూర్తిగా అర్థంచేసుకుని సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 24గంటలూ అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. టిటిడి,పోలీస్,విజిలెన్స్ విభాగాల నుండి ఐటి నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు భక్తుల సమాచారాన్ని తాజాగా అందిస్తూ వైకుంఠం 1 ఐసిసిలో ప్రదర్శించాలని చెప్పారు. తిరుమలకు వచ్చే భక్తుల కోసం సమస్యరహిత వ్యవస్థను నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. భక్తులకు స్వామివారి వైకుంఠ దర్శనాన్ని దివ్యానుభూతిలా మార్చాలని తెలిపారు.

భక్తుల భద్రత ,రద్దీ నిర్వహణకు

అత్యాధునిక ఏఐ సాంకేతికత వినియోగం

-వైకుంఠ దర్శనాలను దివ్యానుభూతిగా మార్చాలి
-టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

అలరించిన సమ్మేళనం

తిరుపతి విద్య, డిసెంబర్ 28 ప్రభాతవార్త

జాతీయ సంస్కృత వర్సిటీలో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనం అలరిస్తోంది. మూడవ రోజు ఆదివారం వికసిత భారత్ కోసం సెమీకండక్టర్స్ అండ్ ఫాబ్ అనే ప్రత్యేక చర్చా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూర్కెలా ఐఐటీ ఆచార్యులు ప్రొఫెసర్ బులుసు ఆనంద్, భువనేశ్వర్ ఐఐటీ ప్రొఫెసర్ శ్రీపద్, ప్రొఫెసర్ రోహిత్ శర్మ, రోపార్, కన్నన్నారాయణన్ పాల్గొన్నారు. వికసిత భారత్ సాధనలో విజ్ఞాన భారత్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వికసిత భారత్ కోసం క్వాంటం కంప్యూటింగ్ అండ్ అప్లికేషన్స్ అనే ప్రత్యేక చర్చా సదస్సుకు అమృత విశ్వవిద్యాపీఠానికి చెందిన ఆచార్యులు డాక్టర్ మృత్యుంజయ్ గుహ మజుందర్, ప్రొఫెసర్ ఆర్ముగమ్, డాక్టర్ హేమావతి నందన్, హెచ్ఎన్ఆ యూనివర్శిటీ, డాక్టర్ దేశ్ ముఖ్ పాల్గొని ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రాధాన్యతపై చర్చించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రాచీన భారతీయ వారసత్వసంపద గురించి విద్యార్థులకు అవగాహన కలిగించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసి సాంస్కృతిక, పరిశోధన, అధ్యయన అంశాలపై జరిగిన ప్రత్యేక పోటీకి దేశంలోని పలు రాష్ట్రాల నుండి 240 ఎంట్రీలు రాగా, వాటిలో 40 ఎంట్రీలు ఎంపికయ్యాయి. ఈ రోజు జరిగిన పోటీలో మొత్తం 26 మంది విద్యార్థులు ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మొదలైన రాష్ట్రాలనుండి వచ్చి ప్రత్యక్షంగా పోటీలో పాల్గొన్నారు. సాంస్కృతిక వైజ్ఞానిక వైభవం, చారిత్రక ప్రదేశాలు, కట్టడాలు, ఆలయాలు, ప్రకృతి పక్షులు ఇటువంటి ఎన్నో అంశాలని పోస్టర్స్ మాధ్యమంలో, రీల్స్ మాధ్యమంలో విద్యార్థులు ప్రదర్శించి న్యాయనిర్ణేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

చిత్తూరు జిల్లాలో తెదేపా బలోపేతంకు కృషి

- జిల్లా టిడిపి అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి

కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని జిల్లా తెదేపా నూతన అధ్యక్షుడు షణ్ముగంరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లా అధ్యక్షుడి హోదాలో తొలిసారి కుప్పం తెదేపా కార్యాలయంకు వచ్చారు. ప్రభుత్వ విప్,కడ పిఎసి ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ తదితరులు ఘనస్వాగతం పలకడంతో పాటు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా షణ్ముగంరెడ్డి కార్యకర్తలు, నేతలనుద్దేశించి ప్రసంగించారు. పార్టీలో ఎవరైనా గీత దాటితే కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. అలాగే పార్టీలో యువతకు తగు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించేలా శ్రేణులు కలసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని కోరారు. పార్టీలో అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ బిసి అయిన తనకు సిఎం జిల్లా అధ్యక్ష పదవి అప్పగించారన్నారు. సమావేశంలో మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షులు రాజగోపాల్, ఉదయ్‌కుమార్, సుబ్బు, వెంకటరమణ, కార్పోరేషన్ డైరెక్టర్లు వేణు, చెక్కునత్తం మణి,హేమాంబరగౌడు, వన్నియకులక్షత్రియ విభాగం నేతలు, కౌన్సిలర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడేపల్లిలో కధం తొక్కిన

కాషాయ దళం

గడపలోపలే కులం-దాటితే హిందువులమంటూ ర్యాలీ

చౌడేపల్లిలో హిందూ సమ్మేళనం దృశ్యాలు

చౌడేపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

గడపలోపలే కులం-దాటితే హిందువులమంటూ ఆదివారం చౌడేపల్లిలో హిందువులు గొప్ప ర్యాలీ, సభను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి హిందువులందరూ చౌడేశ్వరీదేవీ ఆలయం నుంచి దేవతా మూర్తులు, భగత్‌సింగ్ చిత్ర పటాలను తీసుకొని ఊరేగారు. పిల్లగ్రోవి, కోలాటలు, జక్కీకలతో బస్టాండు, బజారువీధి, గాంధీవీధి, సంతగేటు మీదుగా కుమ్మరవీధిలోని కళ్యాణ గంగమ్మ ఆలయానికి చేరుకొన్నారు. భారీ సభనుద్దేశించి పలువురు హిందు వక్తలు ప్రసంగించారు. సమాజంలో హిందులందరూ ఐకమత్యంతో మెలిగి హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. సనాతధర్మం, హిందువుల పుట్టుక వంటివి సభలో వివరించారు. అనేక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హిందూ సోదరులు తరలిరావడంతో చౌడేపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని అన్ని వీధులు కాషాయరంగుల కాగితాలతో నిండిపోయింది. అధిక సంఖ్యలో వచ్చిన వారందరికీ అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. హిందూ సమ్మేళన నిర్వాహక కమిటీ, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సాంకేతికత విస్తరించినా పెరిగిన నేరాలు

నేరనియంత్రణే ప్రధాన లక్ష్యం
-డ్రోన్లతో అసాంఘిక కార్యకలాపాలు నియంత్రణ
-వార్షిక నివేదికలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి,డిసెంబర్ 28ప్రభాతవార్తప్రతినిధి:

తిరుపతి జిల్లాను నేరరహితంగా తయారుచేయడానికి పోలీసులు అహర్నిశలు కృషిచేస్తున్నా ఈ ఏడాది స్వల్పంగా నేరాలు పెరిగాయి. సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నేరస్తుల కదలికలపై నిఘా ఉంచినా నేరాలుమాత్రం తగ్గుముఖం పట్టలేదు. ఈ ఏడాది తిరుపతి జిల్లాలో నమోదైన కేసులు, జరిగిన నేరాలు ,దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణ, మహిళలు,బాలికలపై నేరాల కట్టడి, ప్రముఖుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలపై ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు గణాంకాలతో వెల్లడిం చారు. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 0.71శాతం మేర నేరాలు పెరిగాయి. సైబర్ నేరాల శాతం తగ్గింది. 16మందిపై పిడి యాక్టు నమోదైంది. ఈ ఏడాది 68 గంజాయి కేసులు నమోదు చేసి 762.6కిలోల గంజాయి , 13 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 179మంది నిందితులను రిమాండ్‌కు పంపారు. పలురకాలకు అలవాటుపడిన నేరస్తులను గుర్తించి 258మందిపై షీట్లును తెరిచారు. జిల్లావ్యాప్తంగా 4,005మంది చెడు నడతగలవారిపై నిరంతరం నిఘా ఉంచడం జరుగుతుందని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోక్సో కేసులో 187మంది ముద్దాయిలపై వారి కదలికలపై నిఘా ఉంచారు. ఆస్తిసంబంధిత నేరాలు, సంచాలనాత్మక కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో పోలీసులు పనితీరు భేష్‌గా మారింది. ఈ ఏడాది మొత్తం 1,096 కేసులు నమోదుకాగా వాటిద్వారా 12,22,21,151మేరకు ఆర్థికనష్టం జరిగింది. 525 కేసులు గుర్తించి 5,66,87,179 రికవరీ చేశారు. అక్రమమద్యం, ఎర్ర చందనం నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. మహిళలపై జరిగే నేరాలు, బాలికలపై నేరాలు, ర్యాగింగ్‌పై స్త్రీశక్తిటీమ్‌లతో అవగాహన కల్పించారు.మీడియా సమావేశంలో జిల్లా అదనపుఎస్పీలు రవి మనోహరచారి, శ్రీనివాసులు, నాగభూషణం, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ, సిఐ విక్రమ్ పాల్గొన్నారు.

చిన్నపోటుజేనులో జల్లికట్టు

జనసముద్రంగా మారిన చిన్నపోడుచేను చెదురుమదురు సంఘటనలు

చిన్నపోడుజేనులో జల్లికట్టు పోటీలు తిలకిస్తున్న జనం, పరుగులు పెట్టుతున్న గిత్తలు.

వెదురుకుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త :

మండలంలోని పచ్చికాపల్లం పంచాయితీ చిన్న పోడుజేనులో జల్లికట్టు సంబరాలు అంబరాన్ని అంటాయి. కొడేగిత్తలు రంకేలు వేయడంతో యువకులు పౌరుషంతో బరిలోకి దిగడంతో జలికట్టు సంబరాలు అంబరాన్ని తాకాయి.చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి రైతులు కొడెగిత్తలను ముస్తాబు చేసి తీసుకువచ్చారు.గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి చెక్క పట్టీలు కట్టి అందంగా అలంకరించారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సీని నటుల ఫోటోలతో కొమ్ములకు చెక్క పటీలు,టవలు, నగదు కట్టి యువత పై బరిలోకి దించారు. పశువుల పందాలను చూడానికి జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరింతల నడుమ నువ్వ ... నేన అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. కొన్ని గిత్తలు దొరికిపోవడంతో యువకులు చెక్క పట్టీలను చేజిక్కించుకుని విజయదరహాసంతో కేరితలు కొట్టారు. మరీ కొన్ని గిత్తలు జనంను చీల్చుకుంటూ యువకులను నిరాశ పర్చుతూ పరుగులు పెట్టాయి, పోటా పోటీగా సాగిన గిత్తల పోరులో కొన్ని సార్లు గిత్తలదే పై చేయికాగా ... కొన్ని సార్లు యువకులదే పైచేయిగా మారింది. దుమ్ము రేపుతూ గిత్తలు చేసిన సందడిని మిద్దేల పై నుంచి వీక్షించిన చూపరులకు కనులవిందు చేసింది. గిత్తల పోటీలు రసవత్తంగా సాగాయి. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రసవత్తంగా జరిగాయి. ఎలాంటి అవచనీయమైన సంఘటన చోటుచేసుకోకుండా కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ హనుమంతప్ప, వెదురుకుప్పం ఎస్ఐ నవీన్ బాబు, ఎస్ఆర్.పురం ఎస్ఐ సుమన్ ముదస్తుగా ప్రజలకు అవగాహన కల్పించి రక్షణ చర్యలు చేపటట్టారు. చుట్టు పక్కల మండలాల నుంచి జనం తరలివచ్చారు. జల్లికట్టు సంబరాలను వీక్షించడంకు వచ్చిన వారికి అసౌకర్యం కలుగకుండా మంచినీటి వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో పోటీలు జరగడంతో నిర్వహకులు పోటీలకు సహకరించిన వారికి అభినందనలు తెలిపారు.

పెద్ద శబ్దంతో పేలిన

గ్యాస్ పైప్ లైన్..

పెద్ద ఎత్తున లీకైన గ్యాస్
అప్రమత్తమైన పోలీసు అగ్నిమాపక యంత్రాంగం

రేణిగుంట డిసెంబర్ 28 ప్రభాతవార్త..

.రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి టయోటా షోరూం పక్కన భూగర్భంలో వెళ్తున్న థింక్ గ్యాస్ పైపులైను పెద్ద శబ్దంతో పేలి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. భయంతో జనం పరుగులు తీశారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో భూగర్భంలో ఉన్న పైప్ లైన్‌కు క్రేన్ తగలడంతో ఈ ప్రమాదం సంభవించింది. విషయం తెలుసుకున్న వెంటనే రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు సూచనల మేరకు ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది పోలీసులు గ్యాస్ అథారిటీ అధికారులు సమన్వయంతో వ్యవహరించి మంటలను ఆర్పి గ్యాస్ లీకేజీని నియంత్రించారు. పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఖాళీ చేయించి దూరంగా పంపారు. అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించడంతో ఎలాంటి ప్రాణనష్టం ఆస్తి నష్టం జరగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఏదైనా గ్యాస్ వాసన లేదా ఇతర అనుమానాస్పద పరిస్థితులు గోచరించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వాహనాలకు పార్కింగ్ లేదు : భక్తులకు దర్శనం ప్రశ్నార్థకం

కదలి వచ్చిన భక్తజనం:దర్శనం కోసం నిరీక్షణ - ధర్మకర్తల మండలి ఉన్నా ప్రయోజనం సున్నా!

సువర్ణముఖి నదిలో పార్కింగ్‌చేసిన కార్లు. దర్శనానికి నిరీక్షిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. కర్నాటక,మహారాష్ట్ర,తెలంగాణ నుంచి వచ్చే భక్తులు రవాణా సదుపాయాలపై ఆధారపడక తాము సొంత కార్లలో వస్తున్నారు. దేవస్థానం పార్కింగ్‌కు సన్నిధివీది, ఆలయం పక్కన, నాల్గవ గేటు, మూడవ గేటు పక్కన, రాజగోపురం పక్కన అవకాశం కల్పిస్తున్నారు. అయితే ఈ స్థలం రెండు నుంచి మూడు వందల కార్లకు సరిపోతుంది. కానీ శని,ఆది,సోమవారాల్లో వేలాది కార్లు వస్తున్నాయి. వారికి పార్కింగ్ స్థలం లేకుండా సువర్ణముఖి నదిలో కొన్ని టూరిస్టుబస్టాండుకు అవతల మరి కొన్ని వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. కాంట్రాక్టర్ తాము నిర్ణయించిన పాయింట్ల వద్ద వాహన దారుల నుంచిముక్కుపిండి పార్కింగ్ ఫీజు వసూలు చేసుకుంటున్నారు.కానీ ఎక్కడ వాహనాలు పార్కింగ్ చేసుకోవాలో సూచించటం లేదు.దాంతో వాహన దారులు ఎక్కడ స్థలం ఉంటే అక్కడ పార్కింగ్ చేసుకుంటున్నారు.సన్నిధివీధిలో దేవస్థానం పాదచారుల కోసం చక్కగా షెల్టర్లు ఏర్పాటు చేసారు. దాని పక్కనే నిలబెడుతున్నారు.

అసలే రద్దీ: ఈ మార్గాన్నే ఆర్‌టిసి బస్సులు:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వేల సంఖ్యలో వచ్చే కార్లు,జీపులు, సుమోలను పార్కింగ్ చేసుకోవటానికి తిప్పలు పడుతుంటే కొందరు ఆర్‌టిసి డ్రైవర్లు ముఖ్యంగా సూళూరుపేట, గూడూరు డిపోలకు చెందిన బస్సుల డ్రైవర్లతో పాటు శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి నడిచే పల్లెవెలుగు బస్సులు బిక్షాల గాలిగోపురం నుంచి తేరువీధి నుంచి దేవస్థానం సమాచార కేంద్రం సర్కిల్ నుంచి తిరుపతి వైపు వెళ్ళాలి. కానీ డ్రైవర్లను అడిగే దిక్కులేక పోలీసులు కట్టడి చేయలేక బిక్షాల గాలిగోపురం రాజగోపురం మీదుగా పరుగులు తీస్తున్నారు. ఇక జలవినాయక ఆలయం వద్ద బస్సులు తిరగటం కష్టం కానీ ఎందుకో డ్రైవర్లు ఈ మార్గంలో వెళుతూ ట్రాఫిక్‌కు అంతరాయ కల్గిస్తున్నారు.

దర్శనానికి నిరీక్షణ:

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన భక్తులు రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకుంటుంటారు. పూజలు జరిపించుకోవాలంటే కనీసం ఆలయంలో మూడు నుంచి నాలుగు గంటలు పడుతుంది.మధ్యలో అభిషేకాలంటే ఇంకా ఆలస్యం అవుతుంది. ఆదివారం ఆలయాధికారులుఅ ందించిన సమాచారం మేరకు 30వేల మంది దర్శించుకున్నారు. సుమారు 6వేల మంది రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ఓ వైపు దళారులు పొన్నాలమ్మగుడి వద్ద పార్కింగ్ వసూలు వద్దనే 'సుదర్శనం'అంటూ మభ్యపెట్టి ఆకట్టుకుంటున్నారు. ఇలా భక్తుల భద్రతకు సంబంధించి పట్టించుకునే దిక్కులేదు. ధర్మకర్తల మండలి నియమించినా వారుప దవులకే పరిమితమౌతున్నారు. రద్దీ రోజుల్లో భక్తుల తిప్పలు గురించి కనీసం వాకబ్ చేయటం లేదు.

రతన్ టాటా బెస్ట్ సర్వీస్ అవార్డ్ ప్రదానం

పాకాల, డిసెంబర్ 28, ప్రభాతవార్త

రతన్ టాటా పైఉన్న అభిమానంతో ఆదివారం రతన్ టాటా జయంతి సందర్భంగా మహాప్రస్థానం ట్రస్ట్, ఎంఏకెఎస్ ఫౌండేషన్, శ్రీవారి ట్రస్ట్ వారు పాకాల మండలం దామల చెరువు నందు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలు స్వచ్ఛంద సేవా సంస్థలకు అనగా 23 జిల్లాల నుంచి వచ్చిన స్వచ్ఛంద సేవ సంస్థలకు చెందిన ప్రతినిధులకు 2025 రతన్ టాటా బెస్ట్ సర్వీస్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ ప్రెసిడెంట్ కెవి. నాగరాజు, ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రమేష్,హెల్త్ ఆఫీసర్ సుధాకర్, మహా ప్రస్థానం ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్. నాయుడు, రమాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

అవినీతిపై నిగ్గుతేల్చాల్సిందే

- పులిచెర్ల ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీలు
- తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటున్న మండల ప్రజలు

కల్లూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

గతంలో పులిచెర్ల మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి ఆరోపణలు రాష్ట్రవ్యాప్తంగా ప్రసార మాధ్యమాలు, పత్రికల్లో విస్తృతంగా ప్రచారం అయ్యాయి. కూలీల పేర్లతో నకిలీ పనులు, పనులు లేకుండానే బిల్లులు, యంత్రాలతో చేసిన పనులకు కూలీల వేతనాల నమోదు వంటి ఆరోపణలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఈ ఆరోపణల నేపథ్యంలోనే ప్రస్తుతం ఉపాధి హామీ అధికారులు పులిచెర్ల మండలంలో విస్తృత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు కేవలం ఫార్మాలిటీగా కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవాలను వెలికితీయాలని ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో అయినా అవినీతిని నిర్ధారించి, బాధ్యులైన అధికారులు, సిబ్బంది, మధ్యవర్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఉపాధి హామీ కూలీలకు జరిగిన అన్యాయానికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈసారి అయినా తప్పు చేసిన వారిని వదలొద్దని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

గౌరవ డాక్టరేట్‌తో కే.బి. గురుదేవ్‌కు అంతర్జాతీయ గుర్తింపు

వరదయ్యపాలెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త

సమాజానికి సేవే లక్ష్యంగా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కే.బి. గురుదేవ్‌కు ఇంటర్నేషనల్ తమిళ కల్చరల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించడం గర్వకారణం. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన కృషికి ఇది వచ్చిన సముచిత గుర్తింపు. బీజేపీ తిరుపతి జిల్లా మాజీ జిల్లా నెంబర్ ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర ప్రతినిధిగా కే.బి. గురుదేవ్ సేవలు ప్రశంసనీయమైనవి. సమాజ అభ్యుదయమే లక్ష్యంగా అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారు. ముఖ్యంగా చేనేత, ప్రింటింగ్ వస్త్ర పరిశ్రమల్లో దేశవిదేశాల్లో వ్యాపారం విస్తరించి, అనేక మందికి ఉపాధి కల్పించిన కుటుంబంగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. విద్యారంగంలో కే.బి. గురుదేవ్ - విజయలక్ష్మి దంపతుల సేవలు అనిర్వచనీయమైనవి. యాభై ఏళ్లకు మునుపే వీరి కుటుంబం, వరదయ్యపాలెంలో వీవర్స్ శాల ఏర్పాటు చేసి ఉపాధి కల్పించారు. విద్యే సమాజాభివృద్ధికి పునాది అనే నమ్మకంతో, విద్యా ప్రోత్సాహానికి వారు చేసిన కృషి ప్రశంసనీయం. ఈ సందర్భంగా ఏఐడిడికేకేఎఫ్ నేషనల్ ప్రెసిడెంట్ అరుణ్ వరోడే,ఏపీ దాస్ కన్వీనర్ గుత్తి త్యాగరాజు, కోకన్వీనర్ జక్కుల శివానందం, టీడీపీ దేవాంగ సాధికారిక సమితి చైర్మన్ బీరక ప్రసాద్, పూర్వపు దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్లు బొప్పన తిలక్ బాబు, మెట్ల శైలశ్రీదుర్గ నాగ మల్లేశ్వరరావు దంపతులు, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ జి. ఉదయకుమార్, వరదయ్యపాలెం బిజెపి పార్టీ శ్రేణులు, దిలీప్ రాయల్, పురుషోత్తం, సిద్దులయ్య, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం ప్రసాద్, ఏసు,తిరుపతి చల్ల శ్రీనివాసులు తదితర ప్రముఖులు అభినందనలు తెలిపారు. అలాగే తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుండి ఆయన శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజానికి సేవ చేస్తే గౌరవం తానుగా వస్తుందనడానికి కే.బి. గురుదేవ్ జీవితం మంచి ఉదాహరణ. ఆయనకు లభించిన ఈ గౌరవ డాక్టరేట్ మరింత మంది యువతకు సేవా భావనతో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలవాలని ఆశించారు.

ఫరెవర్ స్టార్ ఇండియా అందాల పోటీలో

కిరీటం దక్కించుకున్న మిస్ టీన్ పరిటాల దివ్య

వరదయ్యపాలెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త

వరదయ్యపాలెం మండలం తడ గ్రామంలో నివాసం ఉంటున్నా పరిటాల నరేష్ బాబు, జీడి కన్స్ట్రక్షన్స్ భవన నిర్మాణం బిల్డర్ పరిటాల సుజాత కుమార్తె పరిటాల దివ్య మిస్టీన్ ఆంధ్రప్రదేశ్‌గా ఎంపికయ్యారు. డిసెంబర్ 2025 సంవత్సరం 19వ తారీఖు నుండి 21 తారీకు వరకు జైపూర్‌లో జరిగిన అందాల పోటీల్లో పాల్గొని ఫరెవర్ స్టార్ ఇండియా సంస్థ నిర్వహించిన, జి స్టూడియోలో పరిటాల దివ్య పాల్గొని విశ్వాసం ఆత్మ ధైర్యం, అందంతో మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్గా కిరీటాన్ని దక్కించుకుంది. దేశమంతటా పదివేల కంటే ఎక్కువ దరఖాస్తులు ఇందులో పాల్గొనగా అందులో 101 విజేతలను గెలిచి తాను మిస్టిన్ ఆంధ్రప్రదేశ్ టైటిల్‌ను దక్కించుకుంది. 2025 సంవత్సరం మిస్ టీన్ ఆంధ్రప్రదేశ్‌గా నిలబడింది ఆమె యొక్క స్ఫూర్తిని ధైర్యాన్ని మెచ్చుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన వారు ఫరెవర్ స్టార్ ఇండియా సమస్త వారికి హృదయపూర్వక అభినందనలు ఈ యొక్క అవకాశాన్ని పరిటాల దివ్యకు కల్పించినందుకు, పరిటాల దివ్యకి తదుపరి అందాల పోటీల్లో ఉన్నత శిఖరాలను గెలుచుకోవాలని మరెన్నో విజయాలు సాధించాలని మిస్టీన్ ఇండియాగా గెలవాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు, సహోదరుడైన పరిటాల గిరి చరణ్ ప్రత్యేకమైన శుభాకాంక్షలు తెలియజేయుచున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు : డిఎస్పీ పార్థసారథి

శాంతిపురం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

గ్రామాల్లో శాంతిభద్రతలకు ఎవరైనా విఘాతం కల్పిస్తేకఠినచర్యలు తప్పవని డిఎస్పీ పార్థసారథి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని నంజంపేటలో డిఎస్పీ అధ్వర్యంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష, సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలులేని వాహనాలు సీజ్ చేశారు. అనంతరం డిఎస్పీమాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలు, కొత్త చట్టాలపై వివరించారు.

సరళమైన భాషలో భగవద్గీత - తెలుగు గీతాలు

చంద్రగిరి, డిశంబర్ 28 ప్రభాతవార్త:

భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో అజరామర గ్రంథమైన శ్రీమద్భగవద్గీత సారాన్ని సామాన్యులను అనువైన సరళమైన భాషలో అందించాలని సంకల్పించినట్లు రచయిత ఎస్.పరంధామ పిళ్ళై తెలిపారు. స్థానిక వైఎస్ఎంఆర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో "భగవద్గీత - తెలుగు గీతాలు" పుస్తకావిష్కరణ గావించి పలువురు ప్రముఖులు రచయిత దంపతులను ఘనపంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలిన జీవితానికి ఆధ్యాత్మిక మార్గదర్శనం భగవద్గీత అన్నారు. ఇటువంటి భగవద్గీతలోని సారాంశాన్ని తనదైనశైలిలో అందించడం జరుగుతున్నదని అన్నారు. కర్మ చేయడం మనధర్మం, ఫలితాన్ని భగవంతుడికి అర్పించడం మనశ్శాంతి అనే సందేశాన్ని కేంద్రంగా చేసుకుని యువత, ఉద్యోగులు, గృహిణిలు, విద్యార్థులు ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా ఈ పుస్తకం రూపుదిద్దుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార విశ్రాంత మిత్ర సభ్యులు కె.మదన్‌మోహన్ రెడ్డి, వై.మదన్‌మోహన్ రెడ్డి, క్షేత్రపాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బ్రాందీ షాపు దగ్ధం

చంద్రగిరి, డిశంబర్ 28 ప్రభాతవార్త:

తొండవాడ బస్టాండ్‌లో గల బ్రాందీ షాపులో శనివారం రాత్రి చోటుచేసుకున్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మద్యం బాటిళ్ళు మంటల్లో దగ్ధం అయినట్లు నిర్వహకులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసు అధికారులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. నష్టాన్ని అంచనా వేస్తున్నారు

కనకమ్మసత్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విజయపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త: మండలంలోని కనకమ్మసత్రం హైయ్యర్ సెకండరీ పాఠశాలలో 1983లో ఇంటర్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. వారి అధ్యాపకులను పూలమాల, శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ అందరూ పూర్వ విద్యార్థులు పదవి విరమణకు చేరువలోఉన్నారని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి పెట్టి మంచి ఆహారపు అలవాట్లుపెంచుకుని జీవనం సాగించాలని కోరారు. పూర్వ విద్యార్థులను అధ్యాపకులను షీల్డు, శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రుద్రారెడ్డి, గోవిందప్పనాయుడు, వెంకటరాజు, పూర్వ విద్యార్థులు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్, చిత్తూరు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ఆర్గనైజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

చౌడేపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బుటకపల్లికి చెందిన ఆంజప్ప(52)కూలీ పనులు చేసుకొంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో అతను గ్రామానికి సమీపంలోని ఆంజనేయస్వామిగుట్టలోగల చెట్టుకు ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందాడు. కాగా మృతికి గల కారణాలు తెలియాల్సి వుంది.

భవానీ నగర్‌లో యాచకుడి మృతి

-మానవత్వం చాటుకున్న పోలీసులు

చౌడేపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

మండలంలోని దిగువపల్లి పంచాయతీ భవానీనగర్‌లో యాచకుడు మృతి చెందాడు. నడిరోడ్డుపై పడి మృతి చెందడంతో తల్లి రోదిస్తున్నా సాయంత్రం వరకు ఎవరూ పట్టించుకోక పోవడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి కథను సుఖాంతం చేసారు. మృతుడి తల్లి కథనం మేరకు...పెద్దపంజాని మండలం రాయలపేట గౌరీనగర్‌కు చెందిన లక్ష్మమ్మ, గోవిందులు మామిడితోటల్లో పనిచేసుకొంటూ జీవిస్తున్నారు. గోవిందు భార్య అతన్ని విడచిపెట్టి పుట్టింటికి వెళ్ళి పోవడంతో తల్లి, కుమారులిద్దరూ బయట ప్రాంతాలకు వెళుతుండేవారు. ఈక్రమంలో గోవిందు ఆరోగ్య పరిస్థితి బాగులేక పోవడంతో లక్ష్మమ్మ అతన్ని బోయకొండకు తీసుకొని వచ్చేసింది. ఇక్కడ భిక్షాటన చేసుకొంటూ జీవిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయాన్నే భవానీనగర్‌లో రోడ్డు దాటుతుండగా గోవిందు ఒక్కసారిగి కుప్పకూలి మృతి చెందాడు. దిక్కుమొక్కులేని పరిస్థితుల్లో కుమారుడు మృతి చెందడంతో తల్లి లక్ష్మమ్మ తల్లడిల్లి పోయింది. ఉదయం నుంచి సాయంత్రం 5గంటలకు ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానికులు 100కు ఫోన్ చేసి సమాచారమందించారు. వెంటనే స్పందించిన వుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు మృతుడి చిరునామాను తెలుసుకొని ఇంటికి పంపారు. దీంతో స్థానికులు పోలీసులను అభినందించారు.

దాతల విరాళం స్వామివారి కైంకర్యానికే : చెన్నరాజశెట్టి

చౌడేపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

దాతలిచ్చిన విరాళాలను స్వామివారి ఆలయంలో జరిగే కైంకర్యానికేనని మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ మాజీ ఛేర్మన్ చెన్నరాజశెట్టి అన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి సరస వెంకటన నారాయణ భట్, ఆయన సోదరుడు సరస సుబ్రమణ్యంలు రూ. 3లక్షలు, జమీందారు వంశీయులు సుగుటూరు రాజేంద్ర, సుగుటూరు బసవరాజ, సుగుటూరు రాజా రమేష్ రాయల్‌లు రూ. 3.20లక్షలను 10యేళ్ళ క్రితం ఆలయ అభివృద్ధికి అందించారన్నారు. ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయగా ప్రస్తుతం అదికస్తా రూ. 9లక్షలు అయ్యిందన్నారు. ఆలయంలో జరిగేవినియోగించేలా చర్యలు తీసుకొంటున్నట్లు ఆయన వివరించారు. ఠాణాదార్ నాగరాజ, సింగిల్ విండో ఛేర్మన్ హరిప్రసాద్‌రాయల్, మాజీ ఎంపిపి శ్రీరామ్ రెడ్డి ప్రసాద్, నూజిల్ల నాగరాజ, గ్రూప్ టెంపుల్స్ ఇఓ కమలాకర్, అశోక్, అండే రాజన్న, పోస్టు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక -కడ పి.డి.

కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గ ంట దాకా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలనుంచివినతులు నేరుగా స్వీకరిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వి.మిట్టపల్లి పంచాయతీ విభజనకు ప్రతిపాదనలు

కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కుప్పం గ్రామీణ మండలంలోని వి.మిట్టపల్లి పంచాయతీ విభజనకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఈ పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 4వేలకు పైబడి జనాభా ఉన్నారు. పంచాయతీలో 24క్లస్టర్లు ఉండగా 14-15దాకా వార్డులు ఉన్నాయి. విస్తీర్ణం, జనాభా పరంగా పంచాయతీ పెద్దదిగా ఉండడంతో మూడుగా విభజించాలని కోరుతూ ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఉన్న మిట్టపల్లి పంచాయతీతో పాటు వేపూరు, ఆవులనత్తం గ్రామాలను పంచాయతీలుగా విభజించాలని ప్రతిపాదించారు.

దివ్యాంగులకు ఉచితంగా వీల్‌ఛెయిర్లు..బెడ్‌షీట్లు పంపిణీ

కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్వర్యంలో ఆదివారం కుప్పంలో ముగ్గురుమంది దివ్యాంగులకు ఉచితంగా వీల్ ఛెయిర్లు, బెడ్‌షీట్లను జిల్లా అధ్యక్షులు మధుసూధనం పంపిణీ చేశారు. అలాగే ఇదివరకు నిర్వహించినవ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ఆధ్మాత్మిక సమన్వయకర్త డా॥ యశోద అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ సమన్వయకర్తలు గజే ంద్రరెడ్డి, జనార్ధన్, సుధా మహాలక్ష్మి, కుసుమ,జయశ్రీ, హరి, సుమంత్, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, మంజునాథ్ పాల్గొన్నారు.

బిసి హాస్టల్‌లో మున్సిపల్ ఛైర్మన్ తనిఖీ

కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

స్థానిక వడ్డిపల్లి గ్రామం వద్దగల ప్రభుత్వ బిసి సంక్షేమ హాస్టల్‌లో ఆదివారం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పోరేషన్‌డైరెక్టర్ వేణుగోపాల్, నేతలు లోకేష్, మల్లయ్య నాయుడు, ప్రసాద్, గిరి, సురేష్ పాల్గొన్నారు.

నేడు కంగుందిలో కరుపస్వామి పూజ

కుప్పం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కంగు ందిలోని శ్రీ విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం కరుపస్వామి, శ్రీ అయ్యప్పస్వామి కన్నెపూజలను నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. కార్యక్రమంను సుబ్బరాయులు స్వామిపెరూర్ అధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 9000276057,9398177362నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఘనంగా కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవం

శాంతిపురం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని శాంతిపురంలో కాంగ్రెస్ పార్టీ కుప్పం ఇన్‌చార్జ్ ఆవుల గోపి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ పతాకావిష్కరణ చేయడంతో పాటు ప్రజలు, కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. దివంగత వైఎస్ విగ్రహానికినేతలు నివాళులు అర్పి ంచారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. దేశాభివృద్ధికి పనిచేస్తూ ఎన్నో సంస్కరణలు, సుపరిపాలన అందించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు నంజప్ప, మునస్వామి, కృష్ణప్పగౌడు, సుబ్రమణ్యం, మున్సిపల్ అధ్యక్షుడు నిజాముద్దీన్, నేతలు ఇర్ఫాన్,సుందరమూర్తి, వేలు, శ్రీనివాసులు, మునిరామయ్య, నాగరాజు, మునికుట్టి, రోహిణప్ప, సుబ్రమణ్యం, ప్రభాకర్ పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్షుడికి ఘనస్వాగతం

శాంతిపురం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

జిల్లా తెదేపా అధ్యక్షుడు షణ్ముగంరెడ్డికి ఆదివారం శాంతిపురంలో తెదేపా నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహంకు షణ్ముగంరెడ్డి నివాళులు అర్పించారు. అనంతరం షణ్ముగంరెడ్డిని నేతలు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షుడు గోపాల్, నేతలు నాగరాజు,బాలకృష్ణనాయుడు, శేఖర్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు సిద్ధేశ్వర స్వామి ఆలయం ముస్తాబు

యర్రావారిపాలెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త:

నూతన సంవత్సర వేడుకలకు తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయం ముస్తాబవుతుంది. యర్రావారిపాలెం ఎస్ఐ విశ్వనాథ్ లోకేష్, తలకోన ఆలయ ఈవో రవీంద్ర రాజు క్యూ లైన్‌ల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ విశ్వనాథ్ లోకేష్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలకు తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని ముందస్తుగా క్యూలైన్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

విద్యుత్ మోటార్లు చోరీ

తొట్టంబేడు డిసెంబర్ 2 ప్రభాతవార్త తొట్టంబేడు మండలంలోని గురప్ప నాయుడు కండ్రిగ, చిన్న కన్నలి, పెద్ద సింగమాల నివసిస్తున్న రైతుల విద్యుత్తు మోటర్లోని స్టాటర్లు గుర్తుతెలియని వ్యక్తులు చోరికే పాల్పడుతున్నట్టు గ్రామస్తులు వాపోతున్నారు. ఆమేరకు గ్రామస్తులు మాట్లాడుతూ గురప్పనాయుడు కండ్రిగ గ్రామంలో 30 స్టాటర్లు, చిన్న కన్నలి, పెద్ద సింగమాలలో 28 స్టాటర్లు చోరీకి గురయ్యాయని దీనిపై పోలీసులు దృష్టి సారించాలని,రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

జిల్లాను జల్లెడ పట్టిన పోలీసులు

- కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ
- 57 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేసిన పోలీసులు

చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త:

చిత్తూరు జిల్లాను శనివారం రాత్రి మొత్తం పోలీసులు జల్లెడ పట్టారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా డిఎస్పీల ఆధ్వర్యంలో సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో పోలీసులు అనుమానస్పద వ్యక్తులను తనిఖీ చేయడం, వాహనాలను పరిశీలించడం, నేరస్తుల కదలికలను పర్యవేక్షించడం, అక్రమ రవాణా కట్టడి చేయడానికి చర్యలు తీసుకోవడం నిర్వహించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో పోలీసులు 57 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను సీజ్ చేయగా, 200 లీటర్ల నాటు సారాను ధ్వంసం చేశారు. చిత్తూరు టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు అనుమానస్పద వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశం నేరాలను ముందస్తుగా అరికట్టడం, ప్రజల్లో భద్రతా వాతావరణంను బలపరచడం, ప్రతి ప్రాంతంలో పోలీసులు గస్తీ తిరుగుతున్నట్లు ప్రజలకు స్పష్టం చేయడంతో పాటు ఆసాంఘీక కార్యకలాపాలను కట్టడి చేయడమే అని పోలీసులు అధికారులు పేర్కొంటున్నారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులు లేదా వాహనాలను గమనిస్తే సత్వరం పోలీసులకు సమాచారం అందించాలని పోలీసు అధికారులు పేర్కొన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా వుంచడం జరుగుతుందన్నారు. అలాగే ఎక్కడైనా ఎదైనా సమస్య ఉత్పన్నం అయితే సత్వరం పోలీసుల సహాయంను పొందవచ్చునని పోలీసులు ప్రజలకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు విభాగం సమన్వయం, స్థానిక ప్రజల సహకారంతో ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సమర్థవంతంగా పూర్తయ్యిందని పోలీసు అధికారులు పేర్కొన్నారు.

గంగమ్మకు పూజలు

బైరెడ్డిపల్లి డిసెంబర్ 28 ప్రభాతవార్త

బైరెడ్డిపల్లి మండల కేంద్రంలోని గంగమ్మ గుడిలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని అన్ని గంగరాళ్ళకు పూజలు చేసి పొం గళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ సందర్భంగా పశువు లకు స్నానాలు చేయించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు బైరెడ్డిపల్లి తెలుగుదేశం మండల అధ్యక్షులు కిషోర్ గౌడ్ ఇంటి వద్దకు చేరి పూజా ప్రారంభించారు.అనంతరం గట్టుమీద గంగమ్మ, బాట గంగమ్మ గుళ్ళల్లో పూజలు నిర్వహించారు. ఊరి పొలిమేరలో ఉన్న గంగరాళ్లకు పూజలు చేశారు.

ఎమ్మెల్యేచే జనసేన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

చిత్తూరురూరల్, డిసెంబరు 28 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం, మురకంబట్టులో రెండవ డివిజన్ జనసేనపార్టీ ఇన్‌ఛార్జీ ఏ గుణశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు ప్రజాసంక్షేమమే రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారన్నారు. అలాగే చిత్తూరు అభివృద్ధికి తాను కట్టుబడి వున్నానని, అభివృద్ధికి సహకారం అందిస్తున్న కూటమి నేతలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన ఏవోసి ఆరణికవిత మాట్లాడుతూ పార్టీకి జనసైనికులు మూలస్థంభాలనీ, పార్టీ పదవులు వున్నా లేకున్నా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మార్గదర్శకంలో నడుస్తున్న జనసైనికులకు ధ

వన్నెకుల క్షత్రియ సంఘంచే క్యాలెండర్ ముద్రణ

ఏర్పేడు,డిసెంబర్ 28 ప్రభాతవార్త

ఏర్పేడు మండలంలోని శ్రీకాళహస్తి నియోజకవర్గ వన్నెకుల క్షత్రియుల సంఘం నూతన సంవత్సర క్యాలండర్‌ను ముద్రించారు.ఈ క్యాలండర్‌ను ఆదివారం మండల కేంద్రంలోని వినాయక గుడివద్ద పూజలు జరిపి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలకు రష్ అధినేత ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సామాజిక సేవలో ఏ అవసరం ఉన్నా నేనున్నానన్నారు. మనం ఐక్యమత్యంగా ఉంటూ తమ స మస్యల సాధనకు కృషి చేయాలన్నారు. అయితే మన సమస్యలను ఎప్పటి కప్పుడు ప్రభుత్వ దృష్టికి తెచ్చి అధికారుల ద్వారా పరిష్కరించుకోవాలని డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సూచించారు. నేడు వన్నెకుల క్షత్రియులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలన్నారు.వన్నెకుల క్షత్రియ సేవా సంఘం ఉమ్మడి చిత్తూరుజిల్లా అధ్యక్షులు తిరుమల రెడ్డి, మాజీ సర్పంచ్ సురేష్ బాబు సదాశివరెడ్డి,మండల వైసిపి ఉపాధ్యక్షులు మునికృష్ణారెడ్డి, పాగాలి సర్పంచ్ రాజేశ్వరి, మాజీ ఎంపిటిసి మునితర్నం రెడ్డి, మాజీ సర్పంచ్ మునిరెడ్డి,కేశవులుంరెడ్డి, పెంచలరెడ్డి, దామోదర్‌రెడ్డి, గెరటారెడ్డి, జగదీష్, వినోద్‌రెడ్డి, నాగమణి,మాధవరెడ్డి, మునిరాంరెడ్డి, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయు రాష్ట్ర కౌన్సిలర్‌గా చిర్రి హరికృష్ణ

తొట్టంబేడు,డిసెంబర్ 28 ప్రభాతవార్త

ఎస్‌టియు ఉపాధ్యాయసంఘ రాష్ట్ర కౌన్సిలర్‌గా చిర్రి హరికృష్ణను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఇక్కడకు సమాచారం అందింది. చిర్రిహరికృష్ణ కేవిబిపురం మండలం అంజూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు.తిరుపతిజిల్లా ఎన్నికల్లో హరికృష్ణను రాష్ట్ర కౌన్సిల్‌లో తీసుకున్నారు. ఆయన మారుమూల పాఠశాలలో పని చేస్తున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిబద్ధతతో పని చేస్తూ మన్ననలందుకుంటున్నారు. అంతేకాక ఎస్‌టియు యూనియన్ బలోపేతానికి ఆహర్నిశలు కృషి చేస్తున్నారు.ఆయనకు ఎస్‌టియు ఉపాధ్యాయులు అభినందించారు. తనపైయూనియన్ పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు.

పరమేశ్వరుని సేవలో అన్నమయ్యజిల్లా కలెక్టర్

ఏర్పేడు,డిసెంబర్ 28 ప్రభాతవార్త

గుడిమల్లంలో వెలసిన అనందవల్లి సమేత పరశురామేశ్వరుని ఆలయంలో ఆదివారం అన్నమయ్యజిల్లా కలెక్టర్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. పూజలు జరిపించుకున్నారు.జిల్లా కలెక్టర్ నిరంతు కుమార్ వారి కుటుంబసభ్యులు రాగా ఆలయ ముఖ ద్వారం వద్ద వారికి ధర్మకర్తల మండలి చైర్మెన్ బత్తల గిరినాయుడు, వేదపండితులు కరుణశర్మలు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న వారికి ఆలయ మర్యాదలతో వేదపండితునిచే ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా గిరినాయుడు ఆలయానికి సంబందించి ప్రచారం చేయాలని కోరారు.అంతేకాక ఆలయాభివృద్ధిని కలెక్టర్‌కు వివరించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ఉచిత పంపిణి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు చింతా సుబ్రమణ్యం సారధ్యంలో భగవద్గీత గ్రంధాన్ని ఇంటింటికి వెళ్ళి ఉచితంగా అందిస్తున్నారు.ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ ధార్మిక కార్యక్రమాలను ఓ బాధ్యతగా నిర్వహిస్తున్నారు. రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండుగల విశిష్టతను వివరిస్తూ పట్టన నడిబొడ్డులోని గాంధీ వీధిలో ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రభోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను అందించారు. ఇందులో భోగి, సంక్రాంతి విశిష్టతలను పేర్కొన్నారు. చింత వెంకటలక్ష్మి, చింత అమరావతి, వెంకటరత్నమ్మ, బి.సురేష్‌యాదవ్‌లు నిర్వహిస్తున్నారు.

సర్వే నంబర్ 32లో ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణ

చంద్రగిరి, డిశంబర్ 28 ప్రభాతవార్త:

చంద్రగిరి లెక్కదాఖలా సర్వే నంబర్ 32లో ప్రైవేటు వ్యక్తులు రహదారి కోసం ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. తొండవాడ సమీపంలోని సర్వే 32 నందు ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించి ఆ మేరకు భవనాలు నిర్మించుకుని వున్నారు. అయితే ఇందులో కొంత భూమి మిగిలివుండగా గతంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్లకు పట్టాలు ఇచ్చే దిశగా చర్యలు చేపట్టారు. ఆ మేరకు రిపోర్టర్లు తమ సొంత నిధులతో భూమిని అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో కొంత మంది మీడియా వారికి స్థలాలు ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో ఆ ప్రతిపాధనలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఇదే భూమిలో 32 సరే ్వనంబర్‌కు ఆనుకుని వున్న ఫ్లాట్స్ యజమానులు తమ స్థలాలలో కాకుండా ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మించేందుకు ఆదివారం పనులు ప్రారంభించారు. దీనిపై సామాజిక మాధ్యమాలలో సమాచారం రావడంతో తహశీల్దార్ శివరామసుబ్బయ్య స్పందించారు. రోడ్డు పనులను నిలువరించి బోర్డులు ఏర్పాటు చేయాలని విఆర్‌ఓలను ఆదేశించారు. ఆ మేరకు పనులను నిలిపివేసినట్లు తహశీల్దార్ వివరణ ఇచ్చారు.

ఏపీ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్‌గా రాము గుప్త

*శ్రీకాళహస్తి డిసెంబర్ 28 ప్రభాతవా*ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ గా శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన అరుణ మెడికల్స్ అధినేత సుబ్బరాము గుప్త (రాము గుప్త) అత్యధిక ఓట్లతో ఎన్నికయ్యారు. రాష్ట్రస్థాయిలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ ప్యానల్ ఆరు మంది అభ్యర్థులను బలపరిచింది. కెమిస్ట్ డ్రగ్గిస్ట్ బలపరిచిన ఆరు మంది ఘన విజయం సాధించారు. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ ఫార్మసీ కౌన్సిల్లో 60,937 మంది ఫార్మాసిస్టులు ఓటర్లుగా ఉన్నారు. వీరికి డిసెంబర్ 11 నుంచి 15 వరకు పోస్టల్ ద్వారా బ్యాలెట్ పేపర్లు అందాయి. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారానే వినియోగించుకోవాలి. ఈనెల 16 నుంచి 24 వరకు రిజిస్టర్ పోస్టు ద్వారా తమ పోస్టల్ బ్యాలెట్ పేపర్ ను ఏపీ ఫార్మసీ కౌన్సిల్, విజయవాడకు పంపించారు. ఏపీ ఫార్మసీ కౌన్సిల్ విజయవాడలో ఈనెల 27 శనివారం అర్ధరాత్రి వరకు ఓట్ల లెక్కింపు నిర్వహించారు. 22,120 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు. ఇందులో 20,320 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన కౌంటింగ్ లో ఏపీ కెమిస్ట్ డ్రగ్గిస్ట్ ప్యానల్ కి చెందిన ఆరు మంది ఘన విజయం సాధించారు. శ్రీకాళహస్తి కి చెందిన అరుణ మెడికల్స్ అధినేత సుబ్బరాము గుప్తాకు 12,798 అత్యధిక ఓట్లతో ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి చెందిన స్నేహితులు, శ్రేయోభిలాషులు, మెడికల్ షాప్ యజమాని లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తమ విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి సుబ్బరాము గుప్త కృతజ్ఞతలు తెలిపారు. ..

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి రూరల్ (ఏర్పేడు) డిసెంబర్ 28 ప్రభాతవార్త

ఏర్పేడు మండలం ముసలిపేడు గ్రామ సచివాలయం వద్ద తిరుపతి లోని ప్రముఖ హాస్పిటల్ డిఎన్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వారిచే చేపట్టిన ఉచిత వైద్య శిబిరం నకు విశేష స్పందన లభించింది. దాదాపు 120 మంది గ్రామస్తులు ఉచిత వైద్య సలహాలతో పాటు మందులు కూడా ఉచితంగానే పొందడం జరిగింది. వైద్య శిబిరం విజయవంతం కావడంతో డిఎన్‌ఆర్ మల్టీ స్పెషాలిటీ యాజమాన్యం, ముసలిపేడు గ్రామ మాజీ సర్పంచ్లు వై. మనోహర్ నాయుడు, అంకయ్య, మరియు జి. రాజారెడ్డి , సి .చెంగలరాయలు, ఏ .దినకర్‌నాయుడు, మధు, వై సుధాకర్ నాయుడు, రామమూర్తి, బత్తియ్య తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

..నేషనల్ నేచురల్ బాడీ బిల్డర్ జనసేన చే అభినందన

శ్రీకాళహస్తి డిసెంబర్ 28 ప్రభాతవార్త

ఇటీవల గోవాలో జరిగినటువంటి నేషనల్ నేచురల్ బాడీ బిల్డర్ కాంపిటీషన్లో శ్రీకాళహస్తి నుంచి షేక్ జావిద్ భాషా పాల్గొని ప్రథమ స్థానంలో గెలిచి గోల్డ్ మెడల్ సాధించి మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం యొక్క గౌరవాన్ని మరియు మన శ్రీకాళహస్తి గౌరవాన్ని నిలబెట్టడం చాలా గొప్ప విషయం, అంతే కాకుండా ఇప్పటి యువతరానికి జావిద్ చాలా ఆదర్శంగా నిలిచారని ఈ సందర్భంగా జనసేన నాయకులు అభినందించి సన్మానించారు జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, నాదెండ్ల రాజేష్, మనీ, దినేష్, నవీన్, భాను ప్రకాష్, ముని చంద్ర, గోపి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు బట్టల పంపిణీ

తొట్టంబేడు డిసెంబర్ 28 ప్రభాతవార్త

ది హోలీ ఎవాంజెలిజమ్ మినిస్ట్రీస్, శ్రీకాళహస్తి అసోసియేషన్ వారిచేతొట్టంబేడు మండలం ఈదులగుంట పేద ప్రజలకు సెమి క్రిస్మస్ సంద ర్భంగా ఆదివారం మధ్యాహ్నం భోజనం, బట్టలు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ది హోలీ ఎవాంజెలిజమ్ మినిస్ట్రీస్, శ్రీకాళహస్తి ప్రెసిడెంట్ ఎన్.ఆనంద్ బాబు అధ్యక్షతన వారి కమిటీ సభ్యులు .సేతు మాధవ్ , కిషోర్ పాస్టర్ రాజ్ కుమార్, .వెంకట క్రిష్ణయ్య, సాయితేజ, వెంకటరత్నం, హనుక్, సతీష్ తదిరులు పాల్గొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరి ఎన్నో 2026 సంవత్సరంలో చేయాలని అసోసియేషన్ వారు నిర్ణయించారు.

వైసీపీ అధ్యక్షుడిని పరామర్శించిన మాజీ మంత్రి రోజా

పుత్తూరు రూరల్, డిసెంబరు 28 ప్రభాతవార్త:

పుత్తూరు మున్సిపాలిటీ గేటు పుత్తూరులో వైసీపీ వాణిజ్య విభాగ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ రెడ్డి(మీ సాలరెడ్డి) తిరుపతి ఆస్పత్రిలో అపెండిసైటిస్ శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రోజా ఆదివారం ఆయన స్వగృహంలో ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని పరామర్శించారు. స్థానిక వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

సర్వసభ్య సమావేశంలో సీనియర్లకు సన్మానం...

రేణిగుంట డిసెంబర్ 28 ప్రభాతవార్త.

.రేణిగుంట రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సర్వసభ్య సమావేశం ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం బ్రాంచ్ అధ్యక్షులు అసం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రేణిగుంట చీఫ్ హెల్త్ సూపర్వైజర్ కామరాజు, టిఆర్ఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గజపతి నాయుడు, శెట్టిపల్లి బ్రాంచ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ నాగార్జున, మాజీ చీఫ్ మేనేజర్ నజీర్ ఖాన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు భావితరాలకు మార్గదర్శకులన్నారు. వారి సూచనలను సలహాలను రాబోయే తరాలు ఆచరించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన ఉద్యోగులకు ఘనంగా సన్మానం నిర్వహించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి జయంతి కుమార్, గ్రామ సర్పంచి నాగేశం, ఏ డి ఎస్ లు భూషణమణి, కోదండరామయ్య, వర్కింగ్ చైర్మన్ రామ్మూర్తి, వైస్ చైర్మన్ రాజేంద్రప్రసాద్, రంగయ్య, జ్ఞాన్ శేఖర్, సహాయ కార్యదర్శులు రవీంద్రబాబు, జయశీలను, ట్రెజరర్ అన్బు, సహాయ ట్రెజరర్ గురుస్వామి, అసిస్టెంట్ కార్యదర్శి రాజేంద్రన్, అప్పారెడ్డి, షణ్ముగం, ఈశ్వరయ్య, శేషాద్రి, మునీర్ భాష, మహిళా పెన్షనర్లు పాల్గొన్నారు..

ఆనందోత్సాహాల మధ్య హ్యాపీ క్లబ్

తిరుపతి విద్య,డిసెంబర్ 28 ప్రభాత వార్త

స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో విద్యార్థుల తల్లిదం డ్రులు , ఉపాధ్యాయులు హ్యాపీ క్లబ్ కార్యక్రమాన్ని అట్ట హాసంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం విద్యార్థుల తల్లిదండ్రులు , పాఠశాల మధ్య పరస్పర అవగాహన ,సహకారం విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి కోసం ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తల్లిదండ్రులకు రాంప్ వాక్, ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది. కొందరి తల్లిదండ్రులు వారి పిల్లలతో కలిసి నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆద్యంతం తల్లిదండ్రుల, విద్యార్థుల ఉపాధ్యాయుల కేరింతలతో ఆనందోత్సాహాల మధ్య సాగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్షీ ్మప్రసన్న మాట్లాడుతూ ఖితల్లి లాంటి రక్షణ తండ్రి లాంటి శిక్షణఖి అనే నినాదంతో శ్రీ చైతన్య పాఠశాలలు ముందుకు సాగుతున్నాయని, విద్యార్థి నిరంతర విద్యా వికాసం కోసం పాఠశాల ,తల్లిదండ్రుల పరస్పర సహకారం ఎంతో అవసరమని అన్నారు. శ్రీ చైతన్య పాఠశాలో విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి వారి ప్రతిభని చాటుకునే విధంగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు , ఉపాధ్యాయులకు శ్రీ చైతన్య పాఠ శాలల ఏజీఎం సురేష్ అభినందనలు తెలియజేశారు.జోనల్ కోఆర్డినేటర్ సుధా నాయర్, డాక్టర్ మోహన్ బాబు, విద్యార్థులు, తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

క్రీడలతోనే శారీరక దృఢత్వం. జోనల్ ఇంచార్జి లక్ష్మణ్

తిరుపతి విద్య,డిసెంబర్ 28 ప్రభాత వార్త

విద్యారంగంలో నిరంతర విజయాలను సాధిస్తున్న భాష్యం క్యాంపస్లు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక న్యూ బాలాజీ కాలనీ లోని భాష్యం జెడ్ సి ఓ క్యాంపస్ నందు జోనల్ స్పోర్ట్స్ మీట్ భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామకృష్ణ ఆదేశాల మేరకు జోనల్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది.ఈ క్రీడా పోటీలను జోనల్ ఇంచార్జి లక్ష్మణ్ క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు , మానసిక బలం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ క్రీడా పోటీలలో బాలికలకు కు ఖో ఖో, త్రో బాల్, చెస్, కారమ్స్, రిలే రన్నింగ్ రేస్ బాలుర విభాగంలో కబడ్డీ, రిలే రన్నింగ్ రేస్, చెస్ , కేరమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో మదనపల్లి, పుంగనూరు బాలికల టీం ఖో ఖో లొ విజయం సాధించగా, తిరుపతి బాలికల టీం త్రో బాల్‌లో విజయం సాధించగా, బాలుర విభాగంలో తిరుపతి బాలుర టీం కబడ్డీ విజేతగా నిలిచారు. విజేతలకు జోనల్ ఇంచార్జి లక్ష్మణ్ చేతుల మీదుగా బహుమతులు, కప్స్ , మెడల్స్, మేమేంటోస్ ఛాంపియన్ ట్రోఫీ అందించారు. గెలుపొందిన విద్యార్థుల జట్లు జనవరి 3 వ తారీఖున వేంకటగిరి , తిరుపతి లొ జరిగే ఇంటర్ జోనల్ పోటీలలో ప్రకాశం జోన్ తో పోటీ పడబోతున్నాయి అని జోనల్ ఇంచార్జి లక్ష్మణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లొ వివిధ బ్రాంచ్ ల ప్రిన్సిపాల్స్ , వ్యాయామ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

డి.యం.పురంలో ఉచిత వైద్యశిబిరం

కార్వేటినగరం,డిసెంబరు 28 ప్రభాతవార్త:

మండలంలోని డి.యం.పురం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.గీతాగోవిందం సేవా సమితి,తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించడం జరి గిం ది. చిన్నపిల్లలు,షుగర్‌వ్యాధి,కీళ్ళ నొప్పులు, స్త్రీ సమ స్యలు, కంటివైద్యం,దంతవైద్యం, జనరల్ ఫిజిషి యన్, చాతి,శ్వాసకోశలకు సంబంధించిన నిపుణులతో వైద్యశిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి ద్వారకానగరం,కరవాటికండ్రిగ, గొల్లకండ్రిగ, దేరాకండ్రిగ,మిట్టకండ్రిగ,మూలకండ్రిగ గ్రామస్థులు సుమారు 260మంది సద్వినియోగం చేసుకు న్నారు.కార్యక్రమాన్ని సర్పంచ్ ఇంజం తులసీకుమారి,మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ కృష్ణయాదవ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో డాక్టర్లు కె.శ్రీధర్,కె.వి.యస్ స్ఫుజన్,సి.నాగలక్ష్మి, రమ్య, రాజారాం,యశ్వంత్,సి.సందీప్,గీతాసౌజన్య,సుబ్బారావు,కె.వి.చంద్రికలతో పాటు యువత భీమారావు,వెంకటముని,నరేంద్ర,శ్యామబాబు,గ్రామస్థులు,తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

శ్రీకాళహస్తి,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యువ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావం దినోత్సవాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి సారధ్యంలో నిర్వహించారు.ఆదివారం శ్రీకాళహస్తిలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందన స్వీకారం చేసారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు తమటం వెంకట నరసింహాలును దామోదర్‌రెడ్డి గుర్తించి ఆయనకు సత్కారం ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ 140 సంవత్సరాల సుదీర్ఘచరిత్ర కల్గిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. పేద ప్రజల పార్టీగా పేదలకు అండగా నిలిచే పార్టీగా గుర్తింపు ఉందన్నారు.సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటు నేటి విద్యాసంస్థలు, పరిశ్రమలు,సాంకేతిక పరిజ్ఞానం నాటి కాంగ్రెస్ పుణ్యమే అని వివరించారు.ఈ కార్యక్రమాల్లో తిరుపతి జిల్లా స్థాయి నాయకులు జ్యోతిశ్వర్ నాయక్, సురేంద్రరరెడ్డి, రాహుల్,రాయల్,ఆంటోని,లు నరసింహులును సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో అజిత్,నాగరాజు, అరుణ్,మహేష్, చరణ్, మాస్ తదితరులు ఎపాల్గొన్నారు.

శివయ్యసేవలో అలహాబాద్ హైకోర్టు జడ్జి

శ్రీకాళహస్తి,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని సేవలో ఆదివారం ఆలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ రాజీవ్‌సింగ్ కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ మోహన్ ఎపిఆర్‌ఓలు ఆలయ మర్యాదలతో వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం తరువాత మృత్యుంజయ ఽస్వామి ఆలయం వద్ద వారికి వేదపండితులచే ప్రత్యేకా శీర్వచనాలు,స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆలయంలోపల ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ వెంకటస్వామి,హరికృష్ణలు పర్యవేక్షించారు.

వేడాం చిన్న మిట్ట కండ్రిగ దళితవాడలో దుప్పట్లు పంపిణి

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం వేడాం చిన్న మిట్ట కండ్రిగ దళిత వాడలో నిరుపేదలకు సత్యసాయి ఛారిటబుల్ ట్రస్టు వారిచే ఉచితంగా దుప్పట్లు పంపిణి చేసారు. సామాజిక కార్యక్రమాల్లో భాగంగా సత్యసాయి సేవా ట్రస్టు ఎన్నో సహాయ కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు.ప్రస్తుతం చలి కాలం భయభ్రాంతుల్ని చేస్తున్న తరుణం లో గ్రామాల్లోనూ, పట్టణంలోని పలు ప్రాంతాల్లో బిక్షగాళ్ళకు దుప్పట్లు అందించారు. వేడాం చిన్న మిట్ట కండ్రిగ గ్రామంలో ని దళిత వాడలో నిరుపేదలకు అలాగే శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు వద్దదుప్పట్లను అందించారు.కాగా సత్యసాయి సేవా మందిరంలో నూతన సంవత్సర క్యాలండర్లను ఆవిష్కరించారు.సత్యసాయి సేవకులు పాండురంగయ్య, లలితమ్మ, దామోదర్ నాయుడు, మునికృష్ణయ్య, జంగయ్య, మిద్దల రామయ్య, సునీల్‌రెడ్డి,మధు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి డివిజన్

తిరుచానూరులో అన్యమత ప్రచారం, మద్యం,మాంసం నిషేధించాలి

తిరుచానూరు డిసెంబర్ 28 ప్రభాతవార్త

తిరుచానూరు క్షేత్రంలో అన్యమత ప్రచారాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై హిందూ భక్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తిరుచానూరు ఘంటసాల విగ్రహం వద్ద తిరుచానూరు హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్లు 746, 747 ప్రకారం అమ్మవారి క్షేత్ర పరిధిలో ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం, మాంసాహారం, అన్యమత ప్రచారాలు మరియు వాటికి సంబంధించిన చిహ్నాలు ఉండరాదని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని ప్లకారులు ప్రదర్శిస్తూ, గుర్తు చేశారు. గత కొన్ని కొన్ని రోజులుగా పవిత్రతకు భంగం కలిగించే చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు.అదే విధంగా ఈ ఘంటసాల సర్కిల్ వద్ద నుంచి అమ్మవారి పసుపు మండపం వద్ద,పవిత్రమైన యోగిమల్లవరం ఆర్చి వద్ద భక్తులు ఆటోలు,బస్సుల కోసం నిలబడే చోట విచ్చలవిడిగా, రోడ్డుపైకి,రోడ్డు ఆక్రమణ చేసుకుని,చికెన్ పకోడీ సెంటర్లు ఏర్పాటు చేసుకుని ఉన్నారు.భక్తుల మనసుకు బాధించేలా,ప్రభుత్వ జీవోలకు వ్యతిరేకంగా ప్రవర్తించడం పట్ల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.అమ్మవారి బ్రహ్మోత్సవాల పదిరోజులు మాత్రమే జీవో ప్రకారం నిబంధనలు పాటించి,తరువాత పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తిరుచానూరు పవిత్రత, పరిరక్షణపై పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సమితి అధ్యక్షులు ముని రామిరెడ్డి , ప్రధాన కార్యదర్శి గిరీష్ ఆధ్వర్యంలో సమితి సభ్యులు మహేష్ దేగల,విజయ్ కుమార్, రమేష్ సింగ్,మల్లేష్,యశ్వంత్ , పూర్ణ చంద్ర,రవి తదితరులు పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపి ప్రభుత్వం, టీటీడీ వెంటనే స్పందించి జీవోలను కఠినంగా అమలు చేసి అమ్మవారి క్షేత్ర పవిత్రతను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.

హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోండి : శ్రీసిటీ ఎస్ఐ

సత్యవేడు, డిసెంబరు 28 ప్రభాతవార్త:

సత్యవేడు మండల పరిధిలో శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ బత్తలవల్లం చెక్‌పోస్టు వద్ద ఆదివారం శ్రీసిటీ పోలీసులు ఎస్ఐ ప్రియాంక ఆధ్వర్యంలో వారి బృందం మొగిలిరెడ్డి, మునస్వామిలతో కలసి ముమ్మర వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్రవాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ ధరించని వాహన దారులకు అపరాధ రుసుము విధిస్తూ, వేగం కన్న ప్రాణం మిన్న, రోడ్డు భద్రత నియమాలను పాటిస్తూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని చిన్నపాటి నిర్లక్ష్యం మీ కుటుంబాన్ని రోడ్డున పడేయచ్చు అని ట్రాఫిక్ నిబంధనలు ఉంది, మీ రక్

వైసిపి ప్రభుత్వంలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదు

పోలేరమ్మ అమ్మవారి క్యాలెండరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

- ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త

గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని విధ్వంసం చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంకు సంబంధించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆయన నివాస గృహంలో ఆవిష్కరించారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడిప్పుడే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ఆలయాలను కూడా వదలకుండా స్వాహా చేశారని విమర్శించారు. పోలేరమ్మ, కొలితోట ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కొలి తోటలోని చెంచు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నూతన క్యాలెండర్ను కూడా ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను కూడా ఎమ్మెల్యే రామ కృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీనివాసులు రెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మురళీకృష్ణ, ఏఎంసి చైర్మన్ కొనుగోటి విశ్వనాథం, మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్,టిడిపి అధ్యక్షులు సత్యనారాయణ, చంద్రమోళి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, బిజెపి నాయకులు టీటీ మణి, టిడిపి నాయకులు మురళి గౌడ్, మురళి, ఉద్యోగుల సంఘం నాయకులు నాగేశ్వరరావు, మాడ వేణు, బడిమల సునీత తదితరులు పాల్గొన్నారు.

గూడూరు డివిజన్

31న హిందూ సమ్మేళనం

సూళ్లూరుపేట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీన హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ సమ్మేళనం నిర్వహణ సమితి ఆదివారం తెలిపారు. శ్రీనగర్ కాలనీలో సాయంత్రం 4 గంటలకు సమ్మేళనం ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా పూజ్యశ్రీ కమలానందభారతి స్వామిజీచే ప్రత్యేక ప్రసంగం ఉంటుందని తెలిపారు. ముఖ్య వక్తగా ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రాంత సహ ప్రచారక్ జనార్ధన్ ఉంటారని తెలిపారు. హిందూ భారతదేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి అనే అంశంపై గన్నవరం భువనేశ్వరి పీఠం స్వామీజీ కమలానంద భారతి ప్రసంగం చేస్తారని తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలవుదాం

కోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కోట మండలం చెందోడు గ్రామంలో ఆదివారం మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారి వాజ్‌పేయి 100వ జయంతిని పురస్కరించుకుని ఎంవి రావు ఫౌండేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా వాజ్‌పేయి చిత్ర పటానికి ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆది లక్ష్మీల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంవి రావు ఫౌండేషన్ ఛైర్మన్ లీలామోహన్ కృష్ణ మాట్లాడుతూ మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలను కొనియాడారు. గూడూరు పట్టణానికి చెందిన మెడిపల్స్ రక్తనిధి కేంద్రం ఇన్‌ఛార్జ్ సురేష్ ద్వారా రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, ధరణి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌చే దుప్పట్లు పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వీస్ ప్రాజె క్టులో భాగంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేసే కార్యక్ర మాన్ని ఆదివారం నిర్వహించారు. రోటరీ క్లబ్ సమావేశ మందిరంలో రోటరీ క్లబ్ కార్యదర్శి చలువాది చక్రవర్తి, రోటరీ సభ్యులు డాక్టర్ సాయిబాబా, తన్నీరు శేషగిరి రావు, సుంకర ప్రతిమ చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాదెండ్ల శాంతికుమారి, అలవల సుధాకర్‌రావులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

కోట, డిసెంబర్ 28 ప్రభాతవార్త

కోట మండలం లక్ష్మక్కకండ్రిగ గ్రామానికి చెందిన జగదీష్ ఈ నెల 26న గడ్డిమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఆ మేరకు చెన్నైలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ చెప్పారు. జగదీష్ భార్య కాపురానికి రాలేదని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. కాగా, జగదీష్‌కు మూడేళ్ల క్రితం వివాహమైందని తెలిపారు.

శివాలయంలో రాజీనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే దుప్పట్లు పంపిణీ

గూడూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని శివాలయం వద్ద పేద లకు రెడ్ సంస్థ ఆధ్వర్యంలో రాజీనేని రామా నాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో దుప్పట్లను పంపిణీ చేశారు. రెడ్ సంస్థ సభ్యులు రాజేష్ మాట్లాడుతూ చలికాలంలో దృష్టిలో ఉంచుకొని రాజునేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారి సహకారంతో దుప్పట్లు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంట్రంగం దేవాలయ కమిటీ చైర్మన్‌కు ఘన సన్మానం

వాకాడు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

వాకాడు మండలం పట్రంగం దేవాలయ కమిటీ చైర్మన్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి నూతనంగా ఎన్నికల కావడంతో టిడిపి నేతలు శాలువా కప్పి ఘనంగా సత్కరించా రు. ఆదివారం మండలం లోని కొండూరు గ్రామంలోని మండల టిడిపి పార్టీ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి నివాసంలో నియోజవర్గ తెలుగు యువత అధికార ప్రతినిధి, టిడిపి నాయకులు ధనుంజయ్ ఇరువు రులు కలి సి శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధనుంజయ, అన్వేష్‌లు మాట్లాడుతూ దేవాలయ పరంగా ప్రతి గ్రామంలో హిందు దేవాలయాలు నిర్మించాలని కోరారు, నిడిగుర్తి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలలో ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్, మండల పార్టీ కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డి సహకారంతో పంచాయతీ అభివృద్ధి తోపాటు దేవాలయాలు పునర్దించాలని కోరారు.

ఎమ్మెల్యేచే శ్రీ కోదండస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పోస్టర్ ఆవిష్కరణ

చిల్లకూరు, డిసెంబర్ 28, ప్రభాతవార్త

చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానంలో 30వ మంగళవారం వైకుంఠ ఏకాదశి మహోత్సవానికి గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్‌ని ఆహ్వానించారు. ఆదివారం గూడూరు పార్టీ కార్యాలయంలో కోదండరాం స్వామి దేవస్థానం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ కోట సతీష్ యాదవ్, ఆలయ కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ధర్మకర్తలు భక్తాని రామయ్య, కొప్పాల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో సిసి రోడ్లు, డ్రైన్ పనులకు శంకుస్థాపన

గూడూరు రూరల్, డిసెంబర్ 28, ప్రభాతవార్త

మండలంలోని చెన్నూరు గ్రామంలోని అరుంధతీ వాడలో 20 లక్షల రూపాయలతో, 3 సిసి రోడ్లు, ఒక డ్రైన్ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. గత 30 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని చెన్నూరు అరుంధతీయ వాడలో అభివృద్ధి పనులు చేపట్టిన శాసనసభ్యులకి అరుంధతీయ వాడ ప్రజలు, కూటమి నాయకులు అందరూ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, 24 సొసైటీ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్ రెడ్డి, నాయకులు మట్టం మురళి, పెద్దలు ముప్పాళ్ళ గిరి ప్రసాద్ రెడ్డి, పడాల రత్నయ్య, ఇందుకూరు. శ్రీకాంత్ రెడ్డి,అల్లం కృష్ణయ్య, ఉగ్గుమూడి రవీంద్రారెడ్డి, ఏఎంసి డైరెక్టర్ మల్లి శ్యామల, ధర్మరాజుల స్వామి దేవస్థాన కమిటీ సభ్యులు కందుకూరు మోనిక,ఉగ్గుమూడి మనోహర్ రెడ్డి, బూత్ కన్వీనర్లు శ్రీనివాసులు, రాజేంద్ర, రాజనాల, స్థానిక నాయకులు అనిల్, హరీష్,రమేష్, శంకరయ్య, నాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

శ్రీకాళహస్తి,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని 16కాళ్ల మండపంలో ఆదివారం భక్తిశద్ధలతో అయ్యప్ప పడిపూజలు నిర్వహించారు.అయ్యప్పకు సంబంధించి శ్రీకాళహస్తీశ్వరాలయ నిర్మాణం సమయంలోనే రాతిస్థంభాలపై చెక్క బడి ఉంది. 16కాళ్ళమండపంలోనూ, అలాగే స్వామి వారి గర్భగుడి ఎదురుగా నిలువెత్తు భక్తకన్నప్ప విగ్రహం పక్కనే సుఖాసనంలో అయ్యప్ప విగ్రహం చెక్కబడింది.స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఇక్కడ అయ్యప్పను దర్శించుకోవటం జరుగుతుంది. ప్రస్తుతం ఆలయానికి శబరిమల వెళ్ళు భక్తులు,మొక్కులు తీర్చుకొని తిరుగుపయనంలో స్వామి,అమ్మవార్లను దర్శించుకోవటం జరుగుతుంది.ఈ నేపథ్యంలో 16కాళ్ళ మండపంలోని అయ్యప్ప విగ్రహం వద్ద 18 మెట్లు ఏర్పాటు చేసి భజనలు చేయటం పూజలు చేయటం జరుగుతుంది. ఆదివారం విశేషంగా పూజలు జరిపించారు. అయ్యప్పభక్తులు తన్మయత్వంతో భజనలు చేస్తూ తరలించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి భట్ ఆలయాల సందర్శన

చౌడేపల్లి, డిసెంబర్ 28 ప్రభాతవార్త

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్ ఆదివారం మండలంలోని దేవస్థానాలను కుటుంబ సభ్యులతో సందర్శించారు. చెడుగుట్లపల్లి మార్గంలోని నాగుళరాళ్ళు, చౌడేపల్లి మృత్యుంజయేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి, శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మలను దర్శించుకొన్నారు. ఆయన సొంత గ్రామం కావడంతో అందరూ భట్‌ను చూసేందుకు ఆసక్తి చూపారు. మృత్యుంజయేశ్వరాలయంలో అర్చకులు రాజశేఖర్‌దీక్షితులు, కుమార, మహేష్‌స్వాములు న్యాయమూర్తికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పరవమశివుడు, పార్వతమ్మ దర్శనానంతరం వేదాశీర్వాదం గావించారు. మదనపల్లి న్యాయమూర్తి సుబహాన్, భట్ సోదరుడు సరస సుబ్రమణ్యం, ఆలయ మాజీ ఛేర్మన్ చెన్నరాజశెట్టి, ఠాణాదార్ నాగరాజ, సింగిల్ విండో ఛేర్మన్ హరిప్రసాద్‌రాయల్, మాజీ ఎంపిపి శ్రీరామ్ రెడ్డి ప్రసాద్, నూజిల్ల నాగరాజ, గ్రూప్ టెంపుల్స్ ఇఓ కమలాకర్, అశోక్, అండే రాజన్న, పోస్టు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన వృత్తి జీవితంలో ఉన్నతశిఖరాలకు దోహదం

తిరుపతి యూనివర్సిటీ, డిసెంబర్ 28ప్రభాతవార్త:

బాధ్యతాయుతమైన వృత్తిపరమైన, సామాజిక నాయకత్వానికి విద్యార్థులను సిద్ధం చేయడమే మా లక్ష్యమని భారత జాతీయ విజ్ఞాన అకాడమీ అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కె. సింగ్ పేర్కొన్నారు.కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించింది. 2025 విద్యా సంవత్సరానికి ఐదువేలమందికి పైగా విద్యార్థుల అకాడమిక్ ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. టాటా మెమోరియల్ సెంటర్ – గ్రామీణ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీపాద్ బనవల్లి గౌరవ అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా 184 మంది డాక్టరల్ స్కాలర్స్‌కు, 700 మందికి పైగా పీజీ విద్యార్థులకు, 4,500 మందికి పైగా అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్సెస్, లా, ఫార్మసీ, అగ్రికల్చర్, ఆర్కిటెక్చర్, హ్యూమానిటీస్ వంటి విభిన్న విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ పట్టాలు పొందారు. .వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ మాట్లాడుతూ 15వ స్నాతకోత్సవం విద్య, పరిశోధన, సమగ్ర అభ్యాసంలో మా నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. క్రమశిక్షణతో కూడిన వృత్తి జీవితాన్ని నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు. నైతిక విలువలు, సమయపాలన, సామాజిక బాధ్యతలను పాటిస్తూ జాతీయ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.

శ్రీస్వామి హంథీరాం బావాజీ నూతన ఆలయ నిర్మాణానికి సహకరించండి

తిరుపతిరూరల్,డిసెంబర్28 ప్రభాతవార్త:

శ్రీవేంకటేశ్వర స్వామితో సాక్షాత్తు పాచికలాడిన మహానుభావుడు శ్రీస్వామి హథీరాం బావాజీ స్మారకంగా నిర్మిస్తున్న నూతన ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ వ్యవస్థాపకులు బుక్య శివ నాయక్ పిలుపునిచ్చారు. శ్రీహథీరాం బావాజీ త్యాగం, భక్తి, నిరహంకారాలకు ప్రతీక అని, ఈ పుణ్యకార్యంలో తిరుపతి ప్రజలు, భక్తులు, దాతలు భాగస్వాములు కావాలని కోరారు. అలాగే ఆలయ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవసరమైన అనుమతులు మౌలిక వసతులు కల్పించి సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా 14 కోట్ల బంజారీ సమాజం తరపన నూతన సంవత్సర, మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, స్వామివారి దివ్య ఆశీస్సులు అందరికి కలగాలని ఆకాంక్షించారు.

హిందుధర్మాన్ని నలుమూలల చాటాలి

- ఘనంగా హిందుసమ్మేళన కార్యక్రమాలు

రామకుప్పం/శాంతిపురం, డిసెంబర్ 28 ప్రభాతవార్త

దేశంలో హిందుధర్మాన్ని నలుమూలల మరింత చాటాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధనరాజు పేర్కొన్నారు. ఆదివారం రామకుప్పం, శాంతిపురంలలో జరిగిన హిందు సమ్మేళనకార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు దేశభక్తి, సేవా కార్యక్రమాల్లో పాలుపంచు కుంటున్నారన్నారు. అన్ని వర్గాలను సమానంగా గౌరవించడంతో పాటు అందరికీ సమన్యాయం అందేలా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశభద్రత విషయంలో ఎవరు కూడా రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రస్థానంలో పదివేల పాఠశాలలు నిర్వహిస్తోందన్నారు. ప్రపంచ స్థాయిలో భారతదేశం గురుస్థానం పొందేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రామాయణం, భగవద్గీతల గురించి విశదీకరించారు. కార్యక్రమంలో సీతాపతి, భాస్కర్ శర్మ ప్రసంగించారు. అంతకు ముందు రామకుప్పం, శాంతిపురంలలో ర్యాలీలు నిర్వహించారు.

కార్యక్రమాల్లో కండ కారా వ్యవహ అనంతశయనం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కాశీనాథ్, పార్టీ అధ్యక్షులు వెంకటరమణ, ఉదయ్‌కుమార్, ఆవుల గజేంద్ర, జనసేన అధ్యక్షుడు హరీష్, విజయ్‌కుమార్, జయప్ప, జనార్ధనరెడ్డి, ఆంజనేయప్ప, నాగరాజు, సతీష్, రాజప్ప, మంజునాథ్,కుమార్, కమలనాథ్‌రెడ్డి, లోకనాథరెడ్డి, రామచంద్ర, బోధి ప్రభాకర్ రాజు, శివ, చంద్రశేఖర్‌రెడ్డి, మంజునాథ్, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గంధోత్సవం

శ్రీకాళహస్తి డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో సువర్ణముఖి నది తీరా నా వెలిసిన జూమ్లేష పీర్ దర్గా ఉత్సవాలు ఆదివారం తహలీల్ పాతహేతో ముగిసిందని దర్గా నిర్వాహకులు సయ్యద్ బాబా ఫరీద్ అన్నారు. దర్గా ఉరుసు కమిటీ సారాధ్యంతో ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగిన గంధమోత్సవానికి విచ్చేసిన భక్తులు పట్టణ ప్రముఖులు అలాగే ప్రముఖ సినీ నటుడు సుమన్, డాక్టర్ గజల్ శ్రీనివాస్ ,రిటైర్డ్ ఎస్పి రాజాసిగామణి ,న్యూ మార్క్స్ కుంపు గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎం ఎన్ రవికుమార్, పోలీస్ అధికారులు భారీ బందోబస్తుతో గంధం మెరమణిలో ఎటువంటి ఆ వాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతిష్ట భద్రతతో మెరమణి విజయవంతంగా నిర్వహించారు కార్యక్రమంలో దర్గా ఉరుసు కమిటీ ప్రెసిడెంట్ ఓరుగంటి నాగేశ్వరరావు,గుమ్మల్ల రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు ,జమురుద్ భాష ఎస్ ఎం జమీల్ బాషా, గౌస్ మొహియుద్దీన్, నజీర్ అహ్మద్ మొహమ్మద్ ,అన్సర్ ,ఉదయ భాస్కర్ ,దిలావర్ హుస్సేన్, జిమ్ లేష షాహి అమీన్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ముస్తాబౌతున్న తొండమాన్‌పురం

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 28 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి ముస్తాబౌతుంది. గత కొన్ని సంవత్సరాలుగా తిరుమలేశుని దర్శనం వైకుంఠ ఏకాదశి సందర్భంగా కష్టసాధ్యంగా మారింది. దాంతో శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని పలు గ్రామాలకు చెందిన వారు శ్రీకాళహస్తి వాసులు సులభ దర్శనం కోసం వైకుంఠ ఏకాదశికి తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేశి,భూదేవి సమేత వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. టిటిడికి అనుబంధంగా ఉన్న ఈ ఆలయాన్ని టిటిడి అధికారులు ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పరుస్తున్నారు. వైకుంఠ ఏకాదశి దర్శనాలకు సిద్ధం చేస్తున్నారు.ఇప్పటికే టిటిడి ఆలయం ముందు చక్కటి ఆకట్టుకునే ఆర్చిని ఏర్పాటు చేసారు. ఆలయ గోపురాన్ని రంగు రంగులతో తీర్చి దిద్దారు. వైకుంఠ ఏకాదశికి వచ్చే భక్తులు సుదర్శనం,సులభ దర్శనం కోసం చక్కటి క్యూలైన్లు ఏర్పాటు చేసారు.

శివయ్య సేవలో హైకోర్టు జడ్జి ద్వివేది

శ్రీకాళహస్తి,డిసెంబర్ 28 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంలో వాయులింగేశ్వరుడుగా వెలసిన స్వామి వారిని ఆదివారం మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ పవన్ కుమార్ ద్వివేది కుటుంబంసభ్యులతో దర్శించుకున్నారు.వారి దక్షిణ గోపురం వద్దకు రాగా ప్రోటోకాల్ ఎఇఓ మోహన్, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు.ఆలయంలో నిర్మాణం చరిత్ర, రాహుకేతుదోష నివారణ పూజల ప్రాధాన్యత, ఇక్కడ స్వామి వారికి అభిషేకాలు నాలుగు కాలాల్లో నిర్వహించబడుతుందని జస్టిస్ ద్వివేదికి వివరించారు. ఆలయంలోపల అంతరాలయ దర్శనాన్ని ఏర్పాట్లను ఆలయంలోపల ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి,పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడు, వెంకటస్వామి, హరికృష్ణలు పర్యవేక్షించారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాల తరువాత వారికి మృత్యుజంయసవనఇమా ఆలయం వద్ద ప్రత్యేకంగా వేదపండితులతో ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలను అందించారు.

సంయమనంతో భక్తులకు సేవలందించాలి

-క్యూలైన్‌నిర్వహణ,సిసికెమెరాలు,డ్రోన్‌లతో నిఘా :జిల్లా ఎస్పీ

తిరుపతి,డిసెంబర్ 28ప్రభాతవార్త:

తిరుమల ఆలయంతోబాటు తిరుపతి జిల్లాలో స్థానికాలయాల్లో వైకుంఠద్వార దర్శనాలు భక్తులకు కల్పి స్తున్నారని, తిరుమలలో పదిరోజులు దర్శనాలు ఉంటాయని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. భక్తులకు పోలీసులు సంయమనంతో సేవలందించాలన్నారు. వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాల్లో ఆలయాల వద్ద భక్తుల క్యూలైన్‌ల నియంత్రణ, ట్రాఫిక్, సిసికెమెరాలు, డ్రోన్లద్వారా నిఘా,పోలీసులు విధులపై ఆదివారం సాయంత్రం దిశానిర్దేశం చేశారు.

ప్రపంచదేశాలకు మన్‌కీ బాత్ స్ఫూర్తిదాయకం

తిరుపతి,డిసెంబర్ 28 ప్రభాతవార్త:

ప్రధాని మోదీ నిర్వహిస్తున్న మన్‌కీబాత్ కార్యక్రమం ప్రపంచదేశాలకు స్ఫూర్తిదాయక మని బిజెపి సీనియర్ నేత గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ మన సులోని భావాలను ప్రజలకు తెలియజేస్తూ అన్ని ప్రాంతాల ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడే ఈ కార్యక్రమం ఎంతో ఆదరణలభిస్తోందన్నారు. ప్రతినెలా చివరి ఆదివారం జరిగే ఈ కార్యక్రమాన్ని ఆదివారం గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, చంగల్రాయులు, వెంకటరత్నం, కట్టమంచి చంద్రబాబు,భాస్కర్‌రెడ్డి వీక్షించారు.

హిందూ సమ్మేళనంలో నగరసంకీర్తనకు గుర్తింపు

తిరుపతి,డిసెంబర్ 28ప్రభాతవార్త:

హిందూ సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించే ఉద్దేశ్యంతో రాయలసీమ రంగస్థలి, భజనమండలి కళాకారులు చేపట్టే నగరసంకీర్తనకు గుర్తింపు లభించింది. ఆర్ఎస్ ఎస్ స్థాపించి వందసంవత్సరాలు పూర్తయిన సందర్భంగా హిందూసమ్మేళనంలో ఇస్కాన్ లీలాప్రభుదాస్ వక్తలు పాల్గొని ప్రశంసాపత్రాలు అందజేశారు.

పిల్లలు శారీరకంగా, ఆరోగ్యంగా ఉండడానికి బేబీ ఒలింపిక్ గేమ్స్ ఎంతో దోహదపడతాయి : శాప్ చైర్మన్

తిరుపతి క్రీడ, డిసెంబర్ 28, ప్రభాతవార్త : ఫేస్–III ఎంటర్టైన్మెంట్స్ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన న్యూ ఇండియా బేబీ ఒలింపిక్ గేమ్స్ – సెకండ్ ఎడిషన్ ను శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బేబీ ఒలింపిక్ గేమ్స్ వంటి కార్యక్రమాలు పిల్లలు శారీరకంగా బలంగా, మానసికంగా ఆరోగ్యంగా ఎదగడానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. చిన్నవయస్సులోనే శరీర కదలికలు, సమతుల్యత, సమన్వయం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందేందుకు ఈ గేమ్స్ ఉపయోగపడతాయని అన్నారు. అలాగే, ఈ పోటీలు పిల్లల్లో చురుకుదనం, శక్తి పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేబీ ఒలంపిక్ గేమ్స్ నిర్వాహకులు శ్రీకర్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోట వాసు, మారుతి హాస్పిటల్ మారుతి, కీర్తి, మదర్ హాస్పిటల్ పద్మజ, తానికొండ రంజిత్ నాయుడు, మధు, పవన్, గోపి పాల్గొన్నారు.